# సరోజ పెళ్ళి కుదిరింది

- ప్రభావతి

వరకట్నం సమస్య మధ్య తరగతి కుటుంబాలకు మోయలేని భారమే ! దాన్ని సునాయాసంగా పరిష్కరించుకున్న సరోజ చేసిన దేమిటి?



ఉదయం పదకొండు గంట లయ్యింది. ఆ వీధిలో ఉంటున్న గృహిణులు, పెళ్ళి కావాల్సిన అమ్మాయిలు, కొత్తగా కాపురాల కొచ్చిన కోడళ్ళు మగవారిని ఆఫీసులకు, పిల్లలను స్కూళ్ళకు పంపి, ఇంట్లో మిగిలిన పనులు పూర్తి చేసుకుని,ఫోంచేసి పక్కపాడి సములుతూ సీతమ్మ ఇంటికి చేరుకున్నారు.

అప్పటికే వరండాలో చాపలు పరచి ఆ వారంలో వచ్చిన వార, మాస పత్రికలు బొత్తిగా పెట్టి వాళ్ళ కోసం ఎదురు చూస్తూ కూర్చున్న సీతమ్మ వచ్చిన అతిథులను నవ్వుతూ పలకరించి"కూర్చోండర్రా" అంది.

అందరూ చాపల మీద సర్దుక్కూర్చుని త లో పుస్తకం తీసుకుని పేజీలు తిరగవేస్తూ కబుర్లలో పడ్డారు.

వాళ్ళ కబుర్లలో ఆ రోజు ఇంట్లో వండుకున్న కూర దగ్గర నుంచి ఏ పత్రికలో పడే సీరియల్ బాగుంటుందో, ఏ పత్రికలో రాజకీయాలు రాస్తారో, ఏ సీరియల్ సినిమాగా తీస్తే బాగుంటుందో దానిలో హీరో, హీరోయిన్లు ఎవరైతే సూపర్ హిట్ అవుతుందో, టీవీ ఎన్నౌన్సర్ల మేకప్ ఎలా ఉంటుందో వరకూ చోటు చేసుకుంటాయి.



"ఈ కబురు విన్నారా? రాజమ్మ కూతురు లేచి పోయిందిట !" కబుర్ల మధ్య ఎవరో బాంబు పేల్చారు.

పుస్తకాల్లో బొమ్మలు చూస్తున్న కొందరు త లెత్తి చూశారు కుతూహలంగా.

"ఇష్టం లేని పెళ్ళి చేస్తామంటే లేచిపోక ఏం చేస్తుంది మరి?" రాజమ్మ కూతుర్ని సమర్థించింది ఓ ఇల్లాలు.

"అవ్వ. ఇష్టం లేకపోతే ఆ మాట చెప్పాలి. అంతే గాని ఇంట్లో వాళ్ళ పరువు తీసే పని చేస్తారా ఎవరన్నా?" ఇంకో ఇల్లాలు ఈసడింపుగా అంది.

"బహుశా చెప్పినా వినిపించుకుని ఉండరు. అందుకే ఈ పని చేసి ఉంటుంది." ఆ సంవత్సరమే కాలేజీ చదువుకి గుడ్‌బై చెప్పిన అమ్మాయి తన ఉద్దేశం చెప్పింది. ఆ అమ్మాయి పేరు విమల. ప్రస్తుతం పుస్తకాలు చదువుతూ, సినిమాలు చూస్తూ తన కాబోయే భర్త ఎలా ఉండాలో, ఎలా ఉంటే బాగుంటుందో ఊహించుకుంటూ ఆ రోజు కోసం ఎదురు చూస్తున్న యువతి.


"ఎవ రెలా పోతే మన కేం గాని, ఈ రోజు సుభద్రమ్మ గారి సరోజకు పెళ్ళి చూపులట్రా !" కామాక్షమ్మ అంది, కళ్ళజోడు తీసి చెంగుతో తుడిచి మళ్ళీ పెట్టుకుంటూ.

"అవును, సుభద్రమ్మగారు మా అత్తగారితో చెప్తుంటే విన్నాను." కొత్త కోడలు సులోచన కామాక్షమ్మ మాటని బలపరిచింది.

"ఏ ఊరు నుంచి వస్తున్నారో? ఉద్యోగస్తుడేనా, లేక చదువు పూర్తి చేసి ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న అబ్బాయా?" కుతూహలంగా అడిగింది సీతమ్మ.

"ఏ పట్నం నుంచో వస్తుండవచ్చు, ఈ రోజుల్లో ఆడపిల్లలు పల్లెటూరి అబ్బాయిలను ఇష్టపడటం కూడానా?" అక్కసుగా గొణిగింది ఎదురింటి సుందరమ్మ. ఆవిడ కూతుళ్ళిద్దరూ 'పల్లెటూరి వాళ్ళను మేము చేసుకోముగాక చేసుకోము' అని పట్టుబట్టి వాళ్ళని అప్పులపాలు చేసి మరీ బస్తీ సంబంధాలు చేసుకోవడం ఆవి డెలా మరిచిపోతుంది? అప్పు డప్పుడూ సమయం వచ్చినపుడు ఇలా దెప్పుతుంటుంది.

"ఏ పట్నం నుంచీ రావడం లేదు. వాళ్ళు ఓ మారుమూల పల్లెటూరి నుంచి వస్తున్నారట."




హేళనగా నవ్వింది సులోచన. ఆ అమ్మాయికి పల్లెటూరి వాళ్ళంటే చాలా చిన్న చూపు. పల్లెటూరి వాళ్ళకి నాగరికత తెలియదని, శుభ్రత పాటించరని, చదువూ సంధ్యా లేని మొరటువాళ్ళని, వాళ్ళ అలవాట్లు, తిళ్ళు అన్నీ వేరుగా ఉంటాయని, వాళ్ళ మాట తీరుకూడా బాగోదని ఆ అమ్మాయి అభిప్రాయం.

"అయితే ఈ పెళ్ళి జరిగేది కాదులే. బియ్యే చదువుకున్న సరోజ ఓ పల్లెటూరి మొద్దుని చేసుకుంటుం దేఁవిటీ?" విమల చెప్పింది ధీమాగా.

"నీ మొహం ! నువ్వు నోరు మూసుకో. నీకేమీ తెలీదు. బస్తీ సంబంధాలంటే మాటలతో ఉన్నాయనుకున్నావా? ఇద్దరు ఆడపిల్లల పెళ్ళి చేసి ఇప్పటికే పీకల లోతు అప్పుల్లో కూరుకుపోయారు వాళ్ళు. ఈ పిల్లక్కూడా శక్తికి మించిన సంబంధం చేస్తే ఇక వీధిలో పడుతుంది వాళ్ళ సంసారం. కట్నం ఇవ్వలేకే పల్లెటూరి సంబంధం చూస్తున్నామని చెప్పింది సుభద్రమ్మ గారు నాతో. కూతుర్ని కసిరింది కోపంగా జానకమ్మ.

"కుర్రాడు ఏం చదివాడో?" గుంపులో ఎవరో అడిగారు.

"పల్లెటూరి వాళ్ళు చదువుల కోసం ఎగబడరు. ఓవేళ చదివినా ఏ వానా కాలం చదువుతోనో సరిపెట్టేస్తారు. అదే వాళ్ళ దృష్టిలో గొప్ప చదువు. ఇంతకీ సరోజ దురదృష్టవంతురాలు. వాళ్ళ అక్కలకు చదువు, ఉద్యోగం ఉన్న భర్తలే దొరికారు - కట్నాలు ఎక్కువే అయినా !" విశాలాక్షి సరోజ గురించి జాలిపడసాగింది.

"పల్లెటూరి వాళ్ళు కూడా ఈ రోజుల్లో కట్నాలు, లాంఛనాల పేరుతో చాలా గుంజుతున్నారు. ఇంతకీ ఈ అబ్బాయి రే టెంతో? అబ్బాయికి స్కూటరివ్వండి. కలర్ టి.వి. ఇవ్వండి, ఫ్రిజ్, వి.సి.పి ఇవ్వండి చాలు" అని డిమాండ్ చేస్తే సుభద్రమ్మ పని ఇరుకున పడ్డట్లే." లోకానుభవంతో తన మనసులో మాట బైటపెట్టింది సీతమ్మ.

"ఈ సంబంధం ఆ బాపతు కాదు లెండి, కట్నం తీసుకోని సంబంధమైతేనే చేసుకుంటాను, అతనికి చదువు, ఉద్యోగం లేకపోయినా సరే - భార్యని వ్యక్తిగా గౌరవిస్తూ అభిమానంగా చూసుకుంటూ ఆదరించే వాడైతే చాలు - అని సరోజ మాట ఇచ్చిందట. అందుకే అటువంటి సంబంధమే చూశారు వాళ్ళు." వెంకాయమ్మ అసలు విషయం వివరంగా చెప్పింది ఆవిడ సుభద్రమ్మ ఇంటి ప్రక్క వాటాలో ఉంటున్నది.

"ఇంతకీ అబ్బాయికి అమ్మాయి, అమ్మాయికి అబ్బాయి నచ్చాలి కదా ఈ పెళ్ళి జరగాలంటే?" అంది జ్యోతి అనే పెళ్ళి కాని అమ్మాయి.

"ఈ చదువుకునే పిల్లలకు ఇ దో వేలంవెర్రి అయిందమ్మా ! మా సరళ కూడా ఇలాగే చెప్తున్నది ఉంటానికి ఇల్లు, వండించుకోవడానికి కాస్త భూ వసతి ఉండి కట్నం తీసుకోకపోతే చాలు - అటువంటి సంబంధమే చూడండి చేసుకుంటాను అని చెప్తున్నది. వాళ్ళ నాన్న గారేమో ఇంజనీర్లను, డాక్టర్లను చూస్తున్నారు. ఇదేమో అటువంటి సంబంధం నా కొద్దు గాక వద్దు అని పట్టు బడుతున్నది" తన గోడు వెళ్ళ బోసుకుంది మరో ముత్తయిదువు.

"మా కాలేజీలో మేడమ్ గారు ఇలాగే చెప్తున్నారు. మీ ఆడపిల్లలు పెళ్ళి గురించి గొంతెమ్మ కోర్కెలు కోరకూడదు. మేము గొప్ప సంబంధాలైతే గాని చేసుకోము, మాకు మా చదువులకి తగ్గ సంబంధం చేస్తేనే గాని ఒప్పుకోము. మా కన్న తక్కువ చదివి ఏ గుమస్తా ఉద్యోగమో చేసేవాడినైతే చస్తే చేసుకోము అని పట్టుబట్టకుండా అబ్బాయి చదువు తక్కువైనా, చేసే ఉద్యోగం చిన్నదైనా తిరస్కరించకుండా చేసుకుంటే ఈ కట్నాల సమస్య చాలా వరకు తగ్గిపోతుంది. కట్నం సమస్య తగ్గిపోవాలంటే మా ఆడపిల్లలు రాజీపడక తప్పదు. త్యాగం చెయ్యక తప్పదు !" అని జ్యోతి చెప్పింది.

"కట్నం వ ద్దంటున్నాడని ఓ పల్లెటూరివాడిని తెచ్చి మీ వాళ్ళు నీకు పెళ్ళి చేస్తే చేసుకుంటావా మరి?" సులోచన ఆ అమ్మాయిని అడిగింది నవ్వుతూ.

"చస్తే చేసుకోను ! కట్నం ఇవ్వలేకపోతే పెళ్ళయినా మానుకుంటాను కాని, చదువు, ఉద్యోగం లేని వాడిని చేసుకుని పల్లెటూరిలో పడి ఉండను బాబూ !' జ్యోతి బుంగమూతి పెట్టి అంటుంటే అందరూ పక్కున నవ్వేశారు.

"ఇన్ని కబుర్లు చెప్పిన ఆ మేడమ్‌గారు పెళ్లి చేసుకుంది పల్లెటూరివాడినా బస్తీలో ఉద్యోగం చేసే వాడినా?" అడిగింది సీతమ్మ.

"అమెరికాలో చదువు పూర్తి చేసుకొచ్చిన ఓ ఆఫీసరు గారిని పెళ్ళి చేసుకున్నారు. బోలెడంత కట్నం ఇచ్చి మరీ" అందర్నీ మరోసారి నవ్విస్తూ చెప్పింది జ్యోతి.

"బాగుందమ్మా మీ మేడమ్ గారి మాటలు, చేతలూను? తన కో నీతి, మరొకరికి ఇంకో నీతీను." ఈస డించేసింది సుందరమ్మ.

"ఆదర్శాలు పల్లించేది ఎదుటి వారి కోసమే కాబోలు." సులోచన నిరసన వ్యక్తం చేసింది.

"ఆరు నూరైనా, నూరు ఆరైనా సరోజ మాత్రం ఈ పెళ్ళి చేసుకోదుగాక చేసుకోదు !" పందెం కాసింది విమల.

"బియ్యే చదువుకున్న అమ్మాయి కదా ! ఆదర్శం కోసం ఏదో చెప్పినా, పెద్ద వాళ్ళ కైనా జ్ఞానం ఉండక్కర్లా? చదువూ, ఉద్యోగం ఉన్న కుర్రాడిని చూడవద్దూ !" అయిష్టంగా గొణిగింది శాంతమ్మ. ఆవిడకు ఒక్కర్తే కూతురు. కట్నం, లాంఛనాలు బాగా ముట్టజెప్పి మరీ గొప్ప సంబంధం చేశారు. ఆ అమ్మాయి సంవత్సరంలో ఆరు నెలలు పుట్టింట్లోనే గడిపేస్తుంది.

"మా అల్లుడి గారికి కాంపు లెక్కువ. అందుకే మా అమ్మాయి ఇక్కడే ఉంటుంది, ఒంటిగా అక్కడ ఉండలేక" అని చెప్తుంటుంది శాంతమ్మ.

ఎక్కువ కట్నం తీసుకున్న అల్లుడు చిన్న ఇల్లు కూడా ఏర్పాటు చేసుకున్నాడని ఆవిడకు తెలుసు. తెలిసినా తెలియనట్లే ఉంటుంది. అదీ ఆవిడలోని గొప్ప తనం.

కొందరు ఆవిడతో ఏకీభవించారు. మరికొందరు ఎవరు ఎవర్ని పెళ్ళి చేసుకుంటే మా కేం'

అన్నట్లు ముభావంగా ఉండిపోయారు.

అప్పుడే టాక్సీ హారన్ వినిపించింది ఆ వీధిలో.

"పెళ్ళి వారి టాక్సీ కాబోలు !" విమల, జ్యోతి, సులోచన గబుక్కున లేచి గుమ్మం దగ్గరకు పరుగెత్తారు. వాళ్ళని అనుసరిస్తూ పెద్దవాళ్ళు కూడా గుమ్మం దగ్గరకు చేరుకున్నారు హడావిడిగా.

టాక్సీ సరోజ వాళ్ళ గుమ్మం దగ్గర ఆగింది. తలుపు తెరచుకుని ఒక్కొక్కరే దిగసాగారు.

వాళ్ళల్లో పెళ్ళికొడుకు ఎవరు? అందంగా ఉన్నాడా? ఒడ్డూ పొడవు బాగుందా ! అనే కుతూహలంతో పెళ్ళి కావాల్సిన అమ్మాయిలు కళ్ళు వెడల్పు చేసుకుని చూస్తుంటే-" ఇటువంటి సమ్మంధం మాకు కూడా దొరికితే బాగుండును బ్రతికి పోదుము." అనే ఆశతో ఆడపిల్లలు గల తల్లులు మనసు లోతుల్లో కోరుకుంటూ దిగే వాళ్ళను చూస్తున్నారు.

"పెళ్ళికొడుకు తెల్లగా, బలంగా, సినిమా హీరోలా ఉన్నాడు, పల్లెటూరి వాడైతే నేం !" దీర్ఘం తీస్తూ అంది సులోచన.

"టాక్సీలో వచ్చారంటే బాగా ఆస్తిపాస్తులున్న వాళ్ళే అయ్యుంటారు." గొణిగింది శాంతమ్మ.

"ఈ రోజుల్లో తినడానికి లేని వాళ్ళు కూడా స్టేటస్ మెయిన్‌టెన్ చేస్తున్నారు. తన కాబోయే భార్యను చూట్టానికి టాక్సీలో రావడం కూడా ఓ గొప్పేనా?" తృణీకరించింది సులోచన.

'ఈ అమ్మాయికి పల్లెటూరి వా ళ్ళంటే అసలు గిట్టదు కాబోలు' అనుకుంది సుందరమ్మ.

టాక్సీ దిగిన వాళ్ళు గుమ్మం దగ్గరే కాళ్ళు కడుక్కుని లోపలికి వెళ్ళిపోయారు. వీళ్ళు కూడా లోపలికి వచ్చేశారు.

"పెళ్ళికొడుకు చాలా బాగున్నాడు కదూ !" స్వాతి ముసిముసిగా నవ్వుతూ అంది.

'అందం కొరుక్కు తింటామా - గుణం మంచిది కావాలి గాని? మా అక్కయ్య గారి అల్లుడు చూపులకు నవమన్మథుడే కాని, అతని బుద్ధే చాలా వక్రంగా ఉంటుంది. భార్యని హింసిస్తాడు. ఎక్కడికీ వెళ్ళనివ్వడు, ఎవరితోనూ మాట్లాడనివ్వడు, పుట్టింటికి కూడా పంపించడు. కూతురి జీవితాన్ని తలుచుకుంటూ మా అక్కయ్య బాధపడుతూ ఉంటుంది. 'మా పిల్ల సుఖపడుతుం దని బోలెడు కట్నం ఇచ్చి మరీ చేసి, దాని బతుకుని నరకంపాలు చేశా'మని. 'నా తలరాత ఇలా ఉంది మీ రేం చేస్తారు' అంటుంది అమ్మాయి. అందం ఉండగానే సరికాదమ్మా! పూవుకి తావి అబ్బినట్లు అందానికి తగినట్లు మంచి హృదయం కూడా ఉంటేనే ఆ అందానికి విలువ !" విషణ్ణ వదనంతో చెప్పి నిట్టూర్చింది తులశమ్మగారు.

"అవును ఆ మాట నిజమేను." అందరూ ఏకగ్రీవంగా అంగీకారం తెలిపారు.

"అయితే మేము అందమైన భర్తల కోసం ఎదురుచూడక్కర్లే దన్నమాట !" అల్లరిగా నవ్వింది విమల.

"గుణం ఉంటే చాలట మరి. అతగాని గుణం తెలుసుకునేది ఎలాగబ్బా?" కొంటెగా అడిగింది జ్యోతి.

"నల్లగా, సన్నగా, పొడవుగా, బోడ్రి క్రాపుతో ఎత్తుపళ్ళు ఉండే అబ్బాయిని చేసుకోండి సుఖపడతారు." సరదాగా అంటూ నవ్వింది సీతమ్మ.

ఆ మాటకి కల్పన అనే అమ్మాయికి రోషం వచ్చింది. కోపంతో మొహం ముడుచుకుంది. సీతమ్మ ఉదహరించిన వర్ణనలన్నీ ఆమె భర్తలో ఉన్నాయి మరి! 'మా వారి అనాకారి తనమే కనిపిస్తుంది కాని వీళ్ళకి, ఆయనలో ఉన్న మంచిగుణం ఏం తెలుసు? నా భర్తని మీ రంతా ఎంత హేళన చేసినా నా కేం బెంగ లేదులే' అనుకుంది తనని తాను ఓదార్చుకుంటూ.

"ఇంతకీ సరోజ పెళ్ళి ఇతనితో జరుగుతుందో, లేదో చెప్ప రేవర్రా?" తెలివిగా సంభాషణ మళ్ళించింది జానకమ్మ.

"సరోజ ఒప్పుకుంటే అవుతుంది." చటుక్కున చెప్పింది జ్యోతి.

" అబ్బాయి ఒప్పుకోకపోతే ...?" గుంపులోంచి అడిగా రెవరో.

"అమ్మాయి నచ్చకపోవడ మంటూ ఉండదు. ఎందుకంటే. పోతపోసిన బంగారు బొమ్మలా ఉంటుంది అమ్మాయి. పైగా చదువుకుంది. వంట పని, ఇంటి పని, కుట్లు పని అన్నీ చేతనవును. నచ్చకపోవడ మంటూ వస్తే అది కట్నం కానుకల దగ్గర రావాలి కాని."

"అయినా ఈ పెళ్ళి జరగ దని మాత్రం కచ్చితంగా చెప్పగలను." విమల చెప్పింది గట్టిగా.

"నువ్వు నోరుముయ్యి! అన్నీ నీకే మహా తెలిసినట్లు వాగుతావు." తల్లి కోపంగా చూస్తూ కూతుర్ని కసిరింది.

"ఈ పెళ్ళి జరిగితే నువ్వే ఓడిపోతావు!" సీతమ్మ అడిగింది సీరియస్‌గా చూస్తూ.

"జరిగితే కదా ఓడిపోవడానికి?" పెంకెగా రెట్టించింది విమల.

"ఈ పెళ్ళి జరక్కపోతే మీ రేం ఓడిపోతా రో చెప్పండి ముందు." జ్యోతి అడిగింది చిలిపిగా.

"మిమ్మల్నందరినీ సినిమాకు తీసుకెళ్తాను." నిజాయితీగా చెప్పింది సీతమ్మ.

"నేను ఓడిపోతే మీ అందరికీ స్వీటు తినిపిస్తాను. సరేనా?" కొంటెగా నవ్వేసింది విమల.

అప్పుడు సుభద్రమ్మ ఇంట్లో పనిచేసే రామి వచ్చింది - "నాలుగు గాజు గళాసు లుంటె ఇమ్మన్నారండి సుబద్రమ్మగోరు" అంటూ.

"ఇస్తా గానీ, ముం దీ మాట చెప్పు. సంబంధం కుదిరిపోయిందా? ఏ మాత్రం కట్నం ఇస్తున్నారు?" ఆత్రంగా అడిగింది సీతమ్మగారు.

"కుదిరిపోయిం దమ్మగారు! ఆరు కట్నం వద్దన్నారు. అమ్మాయి సదువుకున్నదైతే సాలు, మా కేఁవీ వద్దు అన్నారు. ఆరికి బోలెడంత ఆస్తి వుందట. పెద్ద లోగి లుందట. పళ్ళ తోట లున్నాయట. అమ్మగారూ! మా సరోజమ్మగారు అదురుట్టవంతురాలు. మంచి మొగుడు దొరికేడు."

అది మురుస్తూ చెప్తుంటే విమల ముఖం మాడిపోయింది. "సరోజ ఒప్పుకుందా ఈ పెళ్ళికి?" అడిగింది రెట్టిస్తూ.

"అబ్బాయిగారు, సరోజమ్మగారు ఎదురు బదురు కూర్చుని మాటాడుకున్నారు కూడా నమ్మా! 'ఈ పెళ్ళి నీ కిట్టవేనా?' అని అయ్యగారు అడిగితే' నా కిట్టవే నాన్నా' అని అమ్మాయిగోరు సెప్పేరు కూడా. పెళ్ళి మాగ మాసంలో అవ్వుద్దట. బే గెల్లిపోవాలి. గళాసు లివ్వం డమ్మగోరూ! సుబద్రమ్మగోరు ఆలిస్సెం అయ్యిం దని కేకలేస్తారు." రామి తొందరపెట్టింది.

సీత్మగా రిచ్చిన గాజు గ్లాసులు తీసుకుని వెళ్ళిపోయింది.

"మా పిల్లలు స్కూలు నుంచి వచ్చే వేళయింది. వాళ్ళ కోసం ఏదో ఒకటి తినడానికి చేసి ఉంచకపోతే ఇల్లు పీకి పందిరేస్తారు నేను వెళ్తున్నా ఆంటీ!" ఒ కామె లేచి ఇంటి ముఖం పట్టింది.

"మా వారు వచ్చే వేళయింది. నేనూ వెళ్తాను" అంటూ మరొకామె లేచింది.

ఆ వెనకాలే ఒక్కొక్కళ్ళే లేచి ఇళ్ళ ముఖం పట్టారు.

విమల, జ్యోతి కూడా లేచారు "వెళ్తా" మంటూ.

"ఒక్క మాట వినిపోదురుగాని ఉండండి." వెళ్ళేవాళ్ళని ఆపుతూ నిలబెట్టింది సీతమ్మ.

"స్వీటు పార్టీ గురించేనా మీరు చెప్పబోయేది?" జ్యోతి కళ్ళు చిట్లిస్తూ నవ్వింది.

" ఆ పార్టీ మీ ఇద్దరి పెళ్ళిళ్ళూ అయ్యాక ఇద్దురుగాని ఏకంగా! సరోజలాగే మీరు కూడా గొప్ప సంబంధాల కోసం పట్టుపట్టకుండా తక్కువ కట్నంతో వచ్చే అబ్బాయిని పెళ్ళి చేసుకోండి. అటు మీ పెద్దవాళ్ళూ బాధ పడరు, ఇటు మీరూ సుఖ పడతారు. ఏ మంటారు?"

"తప్పకుండా మీ మాట వింటాం అమ్మమ్మగారూ! బియ్యే చదివిన సరోజే సామాన్యమైన వ్యక్తిని భర్తగా కోరుకోగా లేనిది, అంత చదువు లేని మేము మాత్రం గొప్ప సంబంధాల కోసం ఎందుకు పరుగు లెట్టాలి? మీరు చెప్పిన సంబంధాలనే చేసుకుంటాం. ఒట్టు!" పెళ్ళి కావలసిన అమ్మాయి లిద్దరూ ఒకేసారి కోరస్‌గా చెప్పి తుర్రున పారిపోయారు.

ఇళ్ళకు వెళ్ళే వాళ్ళ వైపు చూస్తూ సంతృప్తిగా నవ్వుకుంది సీతమ్మ.

★

---

### వెలుతురు

"పెద్ద పెద్ద హొటళ్ళలో లైట్ల వెలుతురు తక్కువగా ఉంటుంది. ఎందుకురా?" అడిగాడి సోషల్ మాస్టారు.

"తినే పదార్థంలో ఏమైనా పడినా తెలియకుండా ఉండడానికి!" చెప్పాడు గోపి.

'అన్వేషి' [హైదరాబాదు]